


**రాధకు** నేను మాధవుడ్ని కాకపోయినా తనపట్ల నా ఆరాధనెప్పుడూ తగ్గదు. ఎప్పుడూ అంటే నిరవధికం. ఎస్ ! ఇట్స్ లైఫ్‌లాంగ్ ... ఫరెవర్. భార్యాభర్తల మధ్య అనురాగం తాత్కాలికమని, పరిమితమని, పాతబడ్డ కొద్దీ రోతగా మారుతుందనీ అంటారు. ముఖ్యంగా స్త్రీలపట్ల పురుషులకు ఆకర్షణ తగ్గిపోయి అనుబంధంలో యాంత్రికత వేళ్ళూనుకుంటుందని విశేషజ్ఞుల విశ్లేషణ. కాని, మమ్మల్ని చూస్తే అవన్నీ తప్పుడు అభిప్రాయాలేనని ఋజువుకాక తప్పదు.

మాది ప్రేమ వివాహం కాదు. అరేంజ్‌డ్ మ్యారేజీ అనడమూ పూర్తి నిజం కాదు. పెళ్ళికి ముందు మాకు పరస్పర పరిచయముంది. కాని, అది ప్రేమగా మారకముందే పెళ్ళికి దారితీసింది. అయినా ఇప్పటికీ నాకో అనుమానం కల్గుతూంటుంది. 'నేను ప్రేమిస్తున్నంత గాఢంగా తను నన్ను ప్రేమిస్తుందా ?' అని. ఏమో ! స్త్రీ అంతరంగాన్ని బ్రహ్మ కూడా తెలుసుకోలేడంటారు. రాధ నాకింకా పూర్తిగా అర్థం కాలేదేమో అనిపిస్తుంది. కాని, అదంతగా పట్టించుకోవాల్సిన విషయంకాదు. ఎందుకంటే....

నాకు ఏక్షణానికి ఏమవసరమో కనిపెట్టి అమరుస్తుంది ; నేను కోపంగా ఉన్నప్పుడు భయం-భయంగా మసలుకుంటుంది ; బాధలో ఉన్నప్పుడు దగ్గరకు తీసుకొని లాలిస్తుంది; ఆకలిగా ఉన్నప్పుడు అన్నీ.... నాకిష్టమైన వన్నీ క్షణాల్లో చేసి, తినిపిస్తుంది. ఓహ్....! ఎన్నని ! ఎన్నెన్నని చేస్తుంది. నాకోసం ! ఇదంతా ప్రేమకాదా ? కాదనుకుంటే అలా అనుకునేవాళ్ళ దౌర్భాగ్యమేగాని, ప్రేమ కాకుండా ఎలా పోతుంది ? నిజానికి నిర్వచించలేని కొన్ని అపురూపమైన అంశాల్లో ప్రేమకూడా ఒకటి. అందానికి కొలబద్దలు కళ్ళయితే, ప్రేమకు కొలమానం మనసు. దృష్టిని బట్టి అందాన్ని ఆరాధించినట్టే, మనసును బట్టి ప్రేమనూ ఆస్వాదిస్తాం. మా ప్రేమను గురించి చెప్పడానికి చాలా ఉదాహరణలున్నాయి.

తొలిరేయి ..... స్త్రీ పురుషుల అంతరంగ తరంగాల అలజడులను తగ్గించి మమేకం చేసే తొలి సమాగమం - ఆ రాత్రి మాకు చాలా ఆలస్యంగా ఆరంభమైంది.

అది పురోహితుని ముహూర్తనిర్ణయం వల్లకాదు ; మా మధ్య సంభాషణ వల్ల. ఈ విషయమే మా శ్రీకాంత్ గాడితో చెబితే– "నువ్వో తిక్క మనిషివిరా ! ఏ సమయంలో ఏం చేయాలో తెలియనోడివి, నిన్నా దేవుడే కాపాడాలి." అంటూ పోజెట్టాడు. నిజానికి ఆరాత్రిలోని !ప్రతిక్షణం ఇప్పటికీ....

"సార్ ! ఎం. డి. గారు పిలుస్తున్నారు !" అటెండర్ దేవుడమ్మ నా ఆలోచనల్ని కకావికలు చేశాడు.

ఓ నిట్టూర్పు విడిచి, ఆలోచనల సాలీడు చారల్ని విడదీసుకుంటూ ఎం.డి. ఛాంబర్‌లో కదుగుపెట్టాను– అనుమతితో.

"హౌ దూయుడూ, ఆకాశ్ !" చిరునవ్వుతో పలకరించాడాయన.

స్పేస్ షటిల్ నుండి భూమిని చేరే క్షణాలను తలపిస్తూ నా గుండెల్లో ఏదో గుబులు. మా ఎం. డి. తీరే అందుక్కారణం. ఎలా మొదలు పెట్టి ఎక్కడికెళ్తాడో తెలీదు. మొన్న ఇలాగే నవ్వుతూ పలకరించి, బిజినెస్ ద్యూస్ గురించి మొహం వాచేలా క్లాసుపీకాడు – అరగంట.

"ఆకాశ్ ! ఎనీథింగ్ రాంగ్ ?" ఆశ్చర్యం ఒలకబోశాడు. బహుశా అతనూహించిన రెస్పాన్స్ నాలో కనిపించలేదేమో !

ఎదుటివాడ్ని ఏడిపించాలనుకోవడం శాడిజమైతే, వాడు ఆనందంగా ఉన్నప్పుడే ఏడ్పించాలనుకోవడం, అలా లేకపోతే ముందు వాడ్ని నవ్వించి మరీ ఏడ్పించాలనుకోవడం పరమ శాడిజంగాక మరేంటి ?

"నో ! సార్ !" నవ్వునద్దుకున్నాను. 'ఆలస్యమైతే మరో పెడార్థం తీస్తాడు గాబోలు' అనుకుంటూ.

"ఓకే మిస్టర్ ఆకాశ్ ! నాకాట్టే టైంలేదు. నెక్స్ట్‌వీక్ ఆడిటింగ్ వుంది. అకౌంట్సన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండేట్టు చూడు..." అంటూ సూపర్‌వైజ్ చేయాల్సిన పనుల గురించి చకచకా చెప్పాడు – ఎస్సేటైప్ ఆన్సర్‌ని ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్ పొల్లు పోకుండా అప్పజెప్పినట్టు. ఆపై మంచినీళ్ళ గ్లాసందుకున్నాడు.

దాని ఉద్దేశ్యం – చెప్పాల్సిందైపోయింది ఇక వెళ్ళమనో లేక ఇది జస్ట్ బ్రేక్ ఇంకా వుందనో అర్థంకాలేదు.

"ఎస్ ! మిస్టర్ ఆకాశ్ ! నౌ యుకెన్ గో. ఐ థింక్, ఐ నీడ్‌నాట్ టు రిపీట్ ఆర్ రిమైండ్ ఐదర్ థింగ్ ఎనీమోర్ !" అన్నాడు టూత్ పేస్ట్‌యాడ్‌లో హిందీ నటుడిలా.

మొత్తం మీద ఆ మాటలు నాకు ఆనందాన్నే కలిగించాయి. గబుక్కున

బయటికొచ్చేశాను. స్వింగ్‌డోర్ దాటుతుంటే గుర్తొచ్చింది. పెన్ను అతని టేబుల్ మీదే మరచిపోయానని, 'పర్వాలేదులే, దేవుడమ్మున్నాడు గదా' అనుకుంటూ, వెనక్కి వెళ్ళే సాహసాన్ని విరమించి, నా టేబుల్ చేరుకున్నాను.

❋ ❋ ❋

"నాతో మాట్లాడకండి ! నేనూ మీతో మాట్లాడను !" హెచ్చరికలేని తుపానులా గడపలోని కడుగు పెట్టగానే రాధ మాటలు నన్ను కలవరపడేలా చేశాయి.

ఔ ఆఫీసులో ఆరోజెంతో అలసిపోయాను. దీనికి తోడు ఈ రోజు ఎండా, హ్యూమిడిటీ పోటీపడి మరీ కక్ష సాధింపు చర్యలకు దిగాయి. "ఎప్పుడెప్పుడు ఇల్లు చేరుకుంటానా, చల్లని లస్సీ (తను బాగా చేస్తుంది)తో అంతకంటే చల్లని తన మాటల్తో, మృదువైన స్పర్శతో సేద దీరగలనా..." అనుకుంటూ ఇల్లు చేరుకున్న నాకు ద్వార బంధంలో చిరునవ్వుల తోరణాలు కనిపించలేదు. సరేలే, ప్రతిరోజు అలా ఎదురు రావడానికి తనకైనా ఎలా కుదురుతుంది ? అని సరిపెట్టుకొని, సోఫాలో రిలాక్సై లస్సీ కోసం ఎదురుచూస్తుంటే, లస్సీకాదుగదా గ్లాసెడు మంచినీళ్ళయినా ఇవ్వకపోగా వేణ్ణీళ్ళు నెత్తినొలకబోస్తున్నట్టు ఈ వాలకమేంటి ? తన్నుకొస్తున్న కోపాన్ని అణచిపెట్టుకోడం గగనమౌతుంటే మాటల్ని మరచిపోయాన్నేను.

క్షణాలు దొర్లుతున్నాయి. సోఫామీది వెల్వెట్ కవరు నాచేతుల్లో నలుగుతుంది.

భార్యభర్తల మధ్య అనురాగం తగ్గడానికి గల కారణాలు అనుభవంలోకి రావడం మొదలైందన్నమాట. 'ఛ ! ఈరోజే రాధ గురించి ఎంత గొప్పగా ఊహించుకున్నాను?.... ఇంతే, బతుకంతా ఇదే తీరు. మనమేదో సంతోషంలో మునిగి తేలుతుంటాం. వినకూడని సమాచారం అందుతుంది. ఒక్కోసారి ఏదో విచారంలో కొట్టుకుపోతూవుంటాం - శుభవార్తేదో తెలుస్తుంది. దేన్నీ అనుభవించలేం - మనుషులు జీవన ప్రమాణాలు పడిపోటానికి ఇదీ ఓ కారణమేనేమో !

ఏదో నిర్వేదం ఆవరించగా, కురుక్షేత్రంలో తొలిరోజు అర్జునుడిలా కర్తవ్య విమూఢుడిన్నై కూర్చున్నచోటే జేరగిలబడ్డాను. అలసటవల్లో, ఆలోచనా రాహిత్యం వల్లో మూసుకున్న కళ్ళు రిలాక్సవుతుండగా శరీరం సుషుప్తిలోకి జారసాగింది నాకు తెలియకుండానే.....

సడెన్‌గా ఉలిక్కిపడ్డాను.

మొదట బలవంతంగా కళ్ళు తెరిచే ప్రయత్నం చేసి, ఆ తర్వాత మానుకున్నాను. క్షణాలు మధురానుభూతుల తోడుగా నన్నల్లుకోసాగాయి.

రాధ అధరాలు నా కనురెప్పల్ని మృదువుగా స్పృశిస్తూ, సుతిమెత్తగా, ఆపై గాఢంగా

అద్దుకుంటున్నాయి. ఆమె వెచ్చని ఊపిరి నాలో గడ్డకట్టి వున్న ఆవేదనని కరిగిస్తుండగా నా క్రాపు చెరిపేస్తూ ముద్ద ముద్దగా అంటోంది....

"పసి పిల్లలు......ఇలా......అలగొచ్చా ?!"
ఏదో అస్పష్ట సంకేతం ఘ్రాణనాడీ తంత్రుల నుండి మెదడును అందుకునేందుకు ప్రయాసపడుతోంది.

ఆమె మొహం నేను కళ్ళు తెరిచే అవకాశాన్ని కల్గించింది.

ఆశ్చర్యంగా చూశాను.

ఎప్పటిలా స్వచ్ఛమైన చిరునవ్వును నాకందించి, నా నాసికాగ్రాన్ని అంగుష్ఠ, తర్జనిల మధ్య సుతారంగా యిముడ్చుకొని కదిపింది.

"ఎందుకు చెప్పలేదు ?" నిష్ఠూరం ధ్వనించింది. అంతలోనే చందమామ లాంటి ఆమె మొహం కరిమబ్బు కమ్మేసినట్టు అలక అలికేసింది.

"ఏమిటీ ?" నా మట్టిబుర్రకింకా అర్థంకాలేదు. కాని, తను దూరంగా జరుగుతుందన్న స్పృహ కల్గగానే అప్రమేయంగా బాహువులు తనని చుట్టుకున్నాయి.

ఆమె విశాల నేత్రాలు మరింత విచ్చుకున్నాయి- ఆశ్చర్యంగా.

"ఈ రోజు తేదీ ఎంత ?" ఏదో కన్‌ఫర్మ్ చేసుకుంటున్న రీతిలో అడిగింది.

"ఎంత ?" రిపీట్ చేశాను. నిజంగానే గుర్తులేదు నాకు.

"ఏప్రిల్ ఎనిమిది." ఒక్కొక్క అక్షరమూ నొక్కి పలికింది. ఆనందమెక్కువై నప్పుడు నన్ను హత్తుకుపోతున్నట్టు.

"ఆఁ ! అయితే !" నా కనుబొమ్మలు ముడివడ్డాయి. మళ్ళీ మెదడులో ఘర్షణ. ఒకటి.... రెండు..... మూడు....... సెకన్లముల్లు ఆగింది. ఫ్లాష్ వెలిగింది. అంతే - పట్టుబడిపోయినట్టు చూశాను.

"ఏవిఁటండీ యిది ? ఎంత పనున్నా, ఇలాంటి ముఖ్యమైన రోజుని కూడా మరచిపోతారా ?" లాలనగా నా మెడచుట్టూ చేతులు వేసి మందలించింది. ఆ మందలింపు అమ్మలాలనని తలపిస్తోంది.

నేనేదో చెప్పబోయేంతలో నన్నల్లుకుపోయి, చెవిలో గుసగుసగా అంది. "హ్యాపీ......బర్త్‌డే.......టు.......యూ...."

నా కళ్ళలో చెమ్మ - తన గొంతులోని ఆర్ద్రతని సొంతం చేసుకున్నట్టు.

'థ్యాంక్స్ !' అనలేదు. "అయ్.... లవ్.... యూ.... డియర్" అన్నాను తడితడిగా.

"ముందు స్నానం చేసి రండి !" అంది విడివడుతూ.

"నాకు బర్త్‌డే సెలెబ్రేట్ చేసుకునే అలవాటు లేదు. ఆఫీసులో పని 'గోక్కునేందుకు తీరికలే'దన్నట్టుగా వుంది. అదిసరే, ఈ సంగతి రాధకెలా తెలిసిందబ్బా......? ఆలోచిస్తూ బుర్రగోక్కుంటూంటే

"అందుకే ముందు స్నానం చేయమంది !" చిలిపిగా నవ్వుతూ వ్యంగ్యం గంధమద్దింది. టవల్ నా భుజమ్మీద వేస్తూ

❄ ❄ ❄

వరల్డ్ కప్ హడావుడిలా మా ఆఫీసులో ఆడిటింగ్ మొదలైంది. వృత్తిని ఆరాధించడం కూడా ఒక్కొక్కప్పుడు చిక్కుల్ని తెచ్చి పెడ్తుందిగాబోలు. ఆవచ్చిన వాళ్ళు ముగ్గరే. కాని, హంగూ, ఆర్భాటం ఏర్పాట్లు మగపెళ్ళివాళ్ళను తలపించేవిగా ఉన్నాయి. ఎం. డి. దీన్ని ప్రిస్టేజ్ యిష్యూగా తీసుకున్నాడు గాని, పెళ్ళి పెద్దగా వ్యవహరిస్తున్నది నేనే. విచిత్రమేమంటే అంత కష్టంలోను నాకేదో తృప్తి. అందుకు కారణం ఏ కాంప్లెయింటూ లేకుండా ఆడిటింగ్ సాగడమే కాదు. నా ప్రయాసను అర్థం చేసుకుంటున్న రాధ యిచ్చే తోడ్పాటు. రోజంతా అలసిపోయి, అర్థరాత్రికి యిల్లు చేరినా, అంతే ఆత్మీయతతో నన్ను ఆదరించి, మరుసటిరోజుకు నన్ను పవర్‌ఫుల్‌గా రీచార్జ్ చేయగలిగే కళ రాధకు మాత్రమే తెలిసింది. పనిలో పనిగా 'ఇదంతా మా ఆకాశ్ నిర్విరామ కృషి !' అంటూ ఎం. డి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రశంసలూ కురిపిస్తున్నాడాయె. అనుకుటాం గానీ, పొగడ్తలకు కూడా చాలా బలముంటుంది సుమండీ.....

క్లాక్ టవర్ క్రాస్‌రోడ్స్ వద్ద ఆగివున్న నన్ను ఆలోచనల నుండి పక్క బైక్ అతను కదిలించాడు – 'ఎవరో పిలుస్తున్నా'రని.

అతను చూయించిన వైపు చూశాను. వెంకటేశు (వెంకటేశన్నయ్య) బైక్‌ను ట్రాఫిక్‌లోంచి తప్పిస్తు ఫుట్‌పాత్ చేరుకున్నాను– ఆలోచనల్లోనుండి బయటపడుతున్నట్టే.

"ఏరా ఆకాశూ ! పిలుస్తుంటే ఉలకవేట్రా ?" నిష్ఠూరం ఆయన గొంతులో. ఆయన్ది మా వూరే. వాళ్ళ తమ్ముడు గిరీశం నా క్లాస్‌మేట్. వాడు పట్నంలోనే ఉంటం. వాడికోసం వచ్చినప్పుడల్లా నన్ను కలవడం ఆయన కలవాటు. అతడ్ని అన్నయ్యగా గౌరవించడం చిన్నప్పటినుంచీ నా కలవాటు.

"చూళ్ళేదన్నయ్యా !" సంజాయిషీగా అన్నాను.

"సర్లేరా ! మీకాఫీసులో శానా పనుందని, నువ్వు బిజీగా ఉన్నావని మీయావిడ చెప్పిందిలే. ఇయ్యాలేదో స్ట్రైకట గదా, బస్సు గంటన్నర లేటయింది. ఇప్పుడింటికేల్తే మా

గిరీసుగాడింటికాదుండడుగా. పైగా ఆల్లఆఫీసు బీచీ దగ్గరుంటది. వాచ్‌మన్ లోనకెల్లనీయడు. గిరీశులేనప్పుడు ఇంటికేల్లి మనసు పాడుజేసుకోట మిష్టంలేక ఇక్కడ కూచున్నా. వచ్చేపోయే మోటార్లని చూస్తో." అంతసేపు అతని వేళ్ళనంటి పెట్టుకొని ఉన్న సిగరెట్ పీకని నేల మీదవేసి చెప్పుతో నలిపేశాడు. ఎటో చూడసాగాడు- నా మొహంలోకి చూడకుండా.

ఒకసారి ఆఫీసుకేళ్తే సాధారణంగా బయటికొచ్చే అవసరముండదు మధ్యలో. కాని, ఓ కాన్ఫిడెన్షియల్ మ్యాటర్ డిస్కస్ చేసేందుకు అత్యవసరమై బయలుదేరాను. అనుకోకుండా వెంకటేశన్నయ్య కలిశాడు. ఆయన పరిస్థితి చూస్తుంటే జాలేసింది. నానాటికీ అంతరించిపోతున్న రక్తసంబంధాల్ని ఎన్ని సినిమాలొచ్చినా ఉద్ధరించలేవనిపించింది. గిరీశం మంచోడే, వాళ్ళావిడే ఇతడ్ని చీడపురుగును చూసినట్టు చూస్తుంది. అందుకే వాడులేనప్పుడాయన ఆ గుమ్మం తొక్కడు.

"సర్లేరా ! నువ్వెళ్ళు. కనిపిస్తే, ఉండబట్టలేక పిలిచానంతే. ఇంకో రెండుమూడు గంటలు ఎలాగోలా గడిపేస్తే, వాడొచ్చేస్తాడు. వానితో మాట్లాడి ఎల్లిపోతాను."

ఒక్క క్షణం నేను నిస్సహాయంగా చూశాను. అంతలో ఏదో ఆలోచన మెరిసింది. "సర్లే అన్నయ్యా ! మేముండగా ఎక్కడో గడపడమెందుకు ? పైగా రాధ చాలా మంచిది. నువ్వు నేరుగా ఇంటికెళ్ళి రెస్ట్ తీసుకో. సాయంత్రానికి వాడిదగ్గరికెళ్దువుగానీ. త్వరగా వస్తే నేనే దిగబెడతాను."

ఆయనిబ్బంది పడుతున్నట్టు కనిపించాడు. "బాగోదురా ! నాకా అమ్మాయంతగా పరిచయంలేదు."

"బలేవాడివే అన్నయ్యా ! నీకలాంటి అనుమానమే అఖ్ఖర్లేదు. ఇల్లు తెలుసుగా, నువ్వెళ్ళు. నేను తనకి ఫోన్‌జేసి చెబుతాగాని." బలవంతపెట్టానునేను.

అతని మొహంలో అసౌకర్యం తగ్గలేదు సరికదా మరింత పెరిగినట్టని పించింది. నాలోని పట్టుదలా పెరిగింది.

"నువ్వింకేం ఆలోచించకు. ఎల్లెల్లు !"అతనికి మాట్లాడే అవకాశమీయకుండా బైక్ స్టార్ట్ చేశాను.

ఏదో చెప్పబోయిన అతని మాట గొంతు దాటకముందే నేను అక్కడినుండి బయలుదేరాను.

❋ ❋ ❋

కాలానికి విలోమంగా భార్యాభర్తల అనుబంధంలోని మాధుర్యం తగ్గుతుందన్న అంశానికి నేనూ-రాధా సవాలుగా నిలిచాం. ఆఫీసులోనూ నా హోదాతో పాటు ఆదరమూ

పెరిగింది. 'మగాడి విజయం వెనుక ఆడ'దన్న మాటలో పెద్ద రహస్యమేమీలేదు. భర్త మనసెరిగి సహకరించే భార్య ఉండటమే గొప్ప. అదే మగాడి ప్రతిపనిలో బూస్ట్‌గా పనిచేసి విజయ సోపానాలను నిర్మిస్తుంది. 'నేస్తం' శతకకారుడు చెప్పినట్టు....

అలసిన వేళల అమ్మై
పిలిచిన కౌగిళ్ళ గరుగు ప్రేమామృతమై
వలచి వలపించుకోగల
చెలి యిల్లాలైన బతుకు 'చెన్నగు' నేస్తం !

అందమైన భార్యతో ఆనందం, ఐశ్వర్యమూ పెరిగింది ఇతోధికంగా. టూవీలర్ స్థానంలో ఫోర్ వీలరూ వచ్చేసింది. జీవితంలోనే భర్త హోదా నుండి తండ్రిగా ప్రమోషన్ అందుకోవడంలో జాప్యం - కావాలనే.

ఈ రోజు ఒంట్లో నలతగా ఉందంటూ నీర్సంగా సోఫాలో కూర్చున్న రాధకు బుగ్గన మృదువైన ఓ బహుమతిచ్చి, "రిలాక్స్‌గాళ్ !" అంటూ బై చేప్పేసి, కారు తీసి గేటు దాటాను.

తను గత రెండు మూడు రోజులుగా ఇలాగే అంటూంది. రోజూ సాయంత్రం డాక్టరు దగ్గరకెళ్ళాలనుకోటం, తీరా ఆఫీసు నుండి వచ్చేసరికి లేట్ కావడం 'షరామామూ'లైపోయింది. ఈ రోజెలాగైనా సరే డాక్టరు దగ్గరకెళ్ళాలి.

మెయిన్ రోడ్ పైకి మలుపు తిరుగుతుండగా సడెన్‌గా నా ఆలోచనకి బ్రేక్ పడింది. అఫ్‌కోర్స్ కారుకి కూడా. గ్లాస్ షెటర్ కిందికి దింపేసి కేకేసాను.

"వెంకటేశన్నయ్యా !"

ఉలిక్కిపడి, అనుమానంగా చూసి ఆదారబాదరాగా నాదగ్గరి కొచ్చాడు.

"ఎప్పుడొచ్చావన్నయ్యా ?"

"................" అతనింకా తేరుకోలేనట్టున్నాడు.

"రా ! రా ! అటునించి ...... వెళ్తూ, వెళ్తూ మాట్లాడుకుందాం ! "రోడ్డు మీద ఆట్టే ఆగడంలోని ఇబ్బందిని గుర్తించి, అతడ్ని తొందర పెట్టాను.

యాంత్రికంగా నేను చెప్పింది చేశాడు ; డోర్ లాక్ చేసుకొని, బ్రేక్‌పైని కాలిని రిలాక్స్ చేస్తూ స్మూత్‌గా మారుతిని ముందుకు పోనిచ్చాను.

"అంతా కులాసేనా ?" అడిగాను - గేర్ మారుస్తూ.

అంతసేపూ అతనేమి మాట్లాడలేదు. ఇంకా నన్ను చూసిన షాక్ నుండి తేరుకున్నట్టు

లేదు. హోదా సంగతి సరే. కారు ఈ మధ్యే వచ్చింది. దాన్ని నలుగురూ చూసి ఆశ్చర్యపోతుంటే (కొందరసూయ పడుతుంటే కూడా) నాకు ఆనందంగా ఉంటుంది. అంతేకాదు, కారు తోలడంలోని థ్రిల్‌ని ఇప్పుడిప్పుడే ఎంజాయ్ చేస్తున్నాను.

వెంకటేశన్నయ్య నుండి రెస్పాన్సేదీ రాకపోవడంతో పరిశీలనగా చూశాను- స్టైల్‌గా స్టీరింగ్‌ని ఎడమచేతి నుండి కుడిచేతిలోకి మార్చుకుంటూ.

ఆయన కళ్ళలో తడి......కాదు కన్నీళ్ళు ! !

"అరె ....! అదేంటన్నయ్యా ! అలా అయిపోయావ్ ! ఏం జరిగింది ?" కలవరపడ్డాను నిజంగానే

"ఏం లేదురా.....!" కళ్ళు తుడుచుకున్నాడు. "నేనంటే నీ కెందుకురా ఇంత అభిమానం ?" అతని గొంతులో గాద్గదికత స్పష్టంగా తెలుసోంది.

"అదేంటన్నయ్యా ! చిన్నప్పట్నించీ ఒకే చోట ఆడుకున్నాం. ఒకే స్కూల్లో చదువుకున్నాం. మేమేం చేసినా మిమ్మల్నే అనుకరించేవాళ్ళం. నువ్వు మరచి పోయావేమో...... ఓరోజు - నేను ఏడో తరగతిలో ఉండగా, క్రికెట్ ఆడుతుంటే, సురేష్‌గాడి చేతిలోంచి బ్యాట్ జారి నా నుదుటికి తగిలి పడిపోయాను. రక్తం కారకుండా గట్టిగా పట్టుకొని, నువ్వే నన్ను ఆస్పత్రికి తీసుకెళ్ళావు. అప్పుడు నీ షర్టు నిండా నెత్తురు మరకలే......" నా గుండెలోనూ ఆర్ద్రత - అది మాటల్ని బయటికి రానీయకుండా అడ్డుపడింది.

"ఇంతకూ ఎందుకలా ఉన్నావో చెప్పనే లేదు." నేనే ' మౌనాన్ని ఛేదించాను'

చివరకు గొంతు పెగల్చుకున్నాడతను. "ఏం లేదురా ! గిరిగాడి దగ్గరికెల్లం మానేశాను."

"ఏం ?" నమ్మలేకపోయాను.

మొదట అతను చెప్పలేదు. తర్వాత నా బలవంతం మీద చెప్పాడు. వాడసలు అన్నయ్యతో మాట్లాడ్డమే యిష్టం లేనట్టు ప్రవర్తిస్తున్నాడట. సొంత అన్నయ్య పట్ల ఎందుకంత కక్షో అర్థంగాలేదు నాకు. వెంకటేశన్నయ్య అంతకంటె వివరంగా చెప్పనూలేదు. సరేలే, దీన్ని మరీ తవ్వడం బాగుండదు. ఈసారి గిరిగాడు కలిస్తే మాత్రం బాగా దులిపెయ్యాలి. ఇలాంటి వాళ్ళకోసమే గాబోలు 'శివరామరాజు' లాంటి సినిమాలు. ఇంతకూ వాడది చూశాడా ? అవునూ ఆరోజు వెంకటేశన్నయ్యని మా యింటికిగదా వెళ్ళమంది.... ? ఆ విషయం రాధను మళ్ళీ అడగలేదు సరికదా, ఆ రోజు ఆఫీసుకెళ్ళి ఫోన్ చేస్తానని అన్నయ్యకు చెప్పినమాట ఇప్పటికి గానీ గుర్తుకు రాలేదు. అపాలజీ చెబుతూ అదే సంగతి అడిగాను.

మరచి పోయావేమో...... ఓరోజు - నేను ఏడో తరగతిలో ఉండగా, క్రికెట్ ఆడుతుంటే, సురేష్‌గాడి చేతిలోంచి బ్యాట్ జారి నా నుదుటికి తగిలి పడిపోయాను. రక్తం కారకుండా గట్టిగా పట్టుకొని, నువ్వే నన్ను ఆస్పత్రికి తీసుకెళ్ళావు. అప్పుడు నీ షర్టు నిండా నెత్తురు మరకలే......" నా గుండెలోనూ ఆర్ద్రత - అది మాటల్ని బయటికి రానీయకుండా అడ్డుపడింది.

"ఇంతకూ ఎందుకలా ఉన్నావో చెప్పనే లేదు." నేనే 'మౌనాన్ని ఛేదించాను'

చివరకు గొంతు పెగల్చుకున్నాడతను. "ఏం లేదురా ! గిరిగాడి దగ్గరికెల్లటం మానేశాను."

"ఏం ?" నమ్మలేకపోయాను.

మొదట అతను చెప్పలేదు. తర్వాత నా బలవంతం మీద చెప్పాడు. వాడసలు అన్నయ్యతో మాట్లాడ్డమే యిష్టం లేనట్టు ప్రవర్తిస్తున్నాడట. సొంత అన్నయ్య పట్ల ఎందుకంత కక్షో అర్థంగాలేదు నాకు. వెంకటేశన్నయ్య అంతకంటె వివరంగా చెప్పనూలేదు. సరేలే, దీన్ని మరీ తవ్వడం బాగుండదు. ఈసారి గిరిగాడు కలిస్తే మాత్రం బాగా దులిపెయ్యాలి. ఇలాంటి వాళ్ళకోసమే గాబోలు 'శివరామరాజు' లాంటి సినిమాలు. ఇంతకూ వాడది చూశాడా ? అవునూ ఆరోజు వెంకటేశన్నయ్యని మా యింటికిగదా వెళ్ళమంది.... ? ఆ విషయం రాధను మళ్ళీ అడగలేదు సరికదా, ఆ రోజు ఆఫీసుకెళ్ళి ఫోన్ చేస్తానని అన్నయ్యకు చెప్పినమాట ఇప్పటికి గానీ గుర్తుకు రాలేదు. అపాలజీ చెబుతూ అదే సంగతి అడిగాను.

"దీంట్లో బాధపట్టానికేముందిరా ? అప్పట్లో నువ్వెంత టెన్షన్‌లో ఉన్నావో నాకు తెలుసు. అందుకే అసలు వద్దనుకుంటూనే, వెళ్ళకపోతే నువ్వేమనుకుంటావోనని వెళ్ళాను. కాని, మీ యింటికి తాళం వేసుంది."

ఉలిక్కిపడ్డాన్నేను ; ఆయన నన్ను గమనించనేలేదు. అలాగే చెప్పుకుపోతున్నాడు.

"అంతే గాదురా, మళ్ళీ రెండుసార్లొచ్చాను. ఆ రెండు తడవలా గిరిగాడి వద్దకెళ్ళకుండా మీ యింటికే వచ్చాను. కాని తాళమే ఉంది."

ఆశ్చర్యంగా చూశాన్నేను.

"ఈ రోజైనా నా అదృష్టం బాగుంది గాబట్టి దొరికావు. కొంచెం ఎనకా ముందైతే ఇప్పుడూ పట్టుకో గలిగే వాడ్ని కాననుకో ! ఇంతకూ అమ్మాయేదైనా ఉజ్జోగం జేస్తోందా? అమ్మగారింటికేమైనా ఎల్లిందా ?"

వెంటనే నేనేమి సమాధానం చెప్పలేకపోయాను ; అతనూ రెట్టించలేదు. సమాధానంగా ఓ ప్లాస్టిక్ నవ్వుమాత్రం విరియించాను ; దాంతోనే సంతృప్తి పడ్డాడు (గాబోలు).

అన్నయ్యని రైల్వేస్టేషన్‌లో దిగబెట్టి ఆఫీసుకెళ్ళాను. మనసు పనిమీద లగ్నం కావడంలేదు.

అనుమానమనేది పార్థీనియం గడ్డిలాంటిది. అది మొలకెత్తనే గూడదు. మొలిచిందా పెరుగుతుందేగాని, తరగదు. మామూలు పంటలకు మల్లే భారీ వర్షాలక్కర్లేదు. తడిదగిల్తే చాలు.

నా మనసులో ఏమూలనో బీజప్రాయంగా ఉన్న అనుమానం అప్పుడే పార్థీనియం గడ్డిరూపు సంతరించుకోవడం మొదలైందన్నమాట.

వారం రోజుల క్రితం ఇంటి ఓనరు రాజేశ్వరి ఫోన్ చేసి చెప్పిన మాటలు మొదట నమ్మలేదు. తర్వాత అడపాదడపా గుర్తుకొచ్చేవి. ఇప్పుడవి ఫ్రీక్వెన్సీ పెంచుకున్నాయి.

"మాది పరువుగల కుటుంబం నాయనా ! ఇలాంటివి నాకు నచ్చవు. అయినా చిలకా - గోరింకల్లా చూడ ముచ్చటగా ఉంటారు మీరు. మీ ఆవిడకిదేం పోగాలం ? ఇంతకు మునుపైతే అడపాదడపా ఎక్కడికో వెళ్ళేది. ఇప్పుడేకంగా ఇంటికే పిలిపించుకుంటోంది. ఆడా-మగా సమ్మంధాన్ని అపార్థం జేసుకునేంత అవివేకినిగాను, కాని, పరాయి మగాడితో గంటల తరబడి పకపకలూ- ఇకఇకలూ ఎవరికైనా ఏ ఉద్దేశ్యాన్ని కల్గజేస్తాయో నీవే అర్థం చేసుకో. అయినా రేపో-మాపో యెల్లిపోయేవాళ్ళు మీరు. నాకెందుకులే, అని సరిపెట్టుకోలేక పోతూన్నానెందుకో. మొహమ్మీదే అనెయ్యడం నాకు చాతగాదు. ఏదో తల్లిలాంటిదాన్ని, ఉండబట్టలేక.... నీకు చెప్పాలనిపించింది చెప్పాను. నీ 'గౌరవం' నీవు చక్కదిద్దుకో నాయనా............"

ఆఫీసుకు సెలవుపెట్టి వెంటనే ఇంటికెళ్ళాలనిపించింది. ఎస్ ! అదే బెటరు. కారణం కూడా ఉంది. తనకి ఒంట్లో బాలేదంది కదా !

ఆలస్యం చేయకుండా స్టెనోకి లీవ్ సంగతి చెప్పి, ఉన్న ఒక్క అప్పాయింట్ మెంట్ కాన్సిల్ చేయించి (దాని ప్రాధాన్యతనప్పుడు పట్టించుకునే స్థితిలో లేను), ఇంటికి బయల్దేరాను. అలా సడెన్‌గా బయలుదేరుతుంటే నిజంగానే రాధ అస్వస్థత గుర్తొచ్చింది. అంతలోనే వామనరావు మాటలు.....

"పెళ్ళాం చేతిలోనుండి ఏదైనా జారి పడినా, ఒకపనికి బదులు మరొకటి చేస్తున్నా, మనపట్ల ఏమాత్రం ఆసక్తి తగ్గినట్టు కనిపించినా, దాని మనసు మరెక్కడో ఉందని గమనించాలి......"

ఈ మాటలు అతని నోటినుండి విన్నప్పుడు తెగ నవ్వుకున్నాను. 'ఇంతగా అనుమానించే వెధవలున్న సమాజంలో ఆడదాని బతుకు అడవిగాక వెన్నెలవు తుందా ?' అనుకున్నాను. కాని, ముందుకెళ్ళేదారి మృగ్యమైనప్పుడు రివర్స్‌గేరే శరణ్యమన్నట్టుంది

నా పరిస్థితి. దానికి తోడు వెంకటేశన్నయ్య ఎప్పుడొచ్చినా ఇంటికి తాళముంటుందన్న స్టేట్‌మెంట్ నన్ను మరింత డిప్రెషన్‌కు లోనుజేయసాగింది. అంటే....? ఈ వ్యవహారం ఈనాటిది కాదన్నమాట. ఇంతకూ 'ఎవడు వాడు ?'

నా ఆలోచన నాకే వెగటుగా అనిపించింది. రాధను, నా రాధను..... నా ప్రాణానికి ప్రాణమనుకున్న రాధని నేననుమానించడమేంటి ???

విజ్ఞానమెంత ముందుకెళ్తున్నా మనిషి మానసికంగా మాత్రం ఎదగటం లేదన్న విషయాన్ని సమాజంలోని ఎన్నో సంఘటనలు ఋజువు చేస్తున్నాయి. అందులోని అనేకానేక అణువుల్లో నేను కలసిపోయానా ? 'ఏం? రాధకు మాత్రం స్నేహితులుండకూడదా ? వాళ్ళు మగాళ్ళయుంటే తప్పేంటి?' ఇలా ఆలోచించడంతో మనసు కొంచెం తేలికైంది.

నిజమే. ఏ విషయమైనా పాజిటివ్‌గా ఆలోచిస్తే గొడవ వుండదు. ఆధునిక సమాజంలో కొరవడుచున్నది అదే. మొన్నెవడో బస్సులో పేరడిగినందుకు కొట్టాడట. నిన్నెవడో ప్రేమించలేదన్నందుకు పొడిచి చంపేశాడట ఓ అమ్మాయిని- నడిరోడ్డు మీద. నెగెటివ్ థింకింగ్ వల్లే ఈ వైషమ్యాలు, వైరుధ్యాలు, కక్షలు, కార్పణ్యాలు....

అదృష్టవశాత్తు ఏ ప్రమాదమూ జరగకుండా ఇల్లు చేరుకున్నాను.

నా పాజిటివ్ థింకింగ్‌ని సవాలు చేస్తూ........ ఇంటికి తాళం !

నా జీవితంలో ఇలాంటి భయంకరమైన క్షణాలొస్తాయనుకోలేదు. రాధ చేస్తున్న పొరబాటు (తప్పనే నా నమ్మకం) గురించి ఆమెను నిలదీయలేకపోయాను. అందుకు కారణం తనపట్ల నాకున్న ఆరాధనో, నిరాధారమైన విషయాన్ని నిలదీయలేని అధైర్యమో ఖచ్చితంగా చెప్పలేను. అలాగని ఆమెపట్ల కోల్పోయిన నమ్మకాన్ని మళ్ళీ కూడగట్టుకోలేకపోతున్నాను. దీనికి తోడు ఆమెలోనూ నాపట్ల ఉపేక్ష, నిర్లక్ష్యం, నిరుత్సాహం పెరిగిపోతున్నట్టనిపిస్తోంది. మాకు తెలయ కుండానే మా మధ్య అగాధం పెరిగిపోతుంది. నిశ్శబ్ద యుద్ధం ఆక్టోపస్‌లా మా అంతరంగాల్ని పట్టికుదిపేస్తోంది.

యాంత్రిక జీవనం సంసారంలోనూ యింత అవలీలగా ప్రవేశించడం నమ్మలేని నిజం. మొదట్లో ఇది చేదుగా, దుర్భరంగా అనిపించినా ప్రస్తుతం రుచిహీనత స్పష్టంగా తెలుస్తోంది.

ఇటువంటి అనుబంధాన్ని పెంచి పోషించుకోవడం కంటె, తెంచుకోవడమే శ్రేయస్కరమన్న నా అభిప్రాయాన్ని రాధ ఔననలేదు - కాదననూలేదు. ఒక రకంగా ఆమె మౌనం నన్ను మరింత దారుణంగా ఆలోచింపజేస్తుందనడం అతిశయోక్తి కాదు.

లాయర్‌ని సంప్రదించాక పరిస్థితి మరింత క్లిష్టమైంది. సినిమాల్లో చూసినంత అలవోకగా విడాకులు మంజూరయ్యే అవకాశం లేదని తెలిసి పోయింది. ఇన్ని లిటికేషన్

లుంటాయనుకోలేదు. బహుశా రాధపట్ల నాప్రేమ తగ్గకపోవడమే ఇంకా తన గురించి తీవ్రంగా ఆలోచింపజేస్తుందేమో ! అయినా నా ఒక్కడికీ ప్రేముంటే ఏం లాభం? తన నిర్లిప్తత తలచుకుంటేనే అలర్జీ పుట్టుకొస్తుంది.

300 గజాల స్థలంలో అందంగా ప్లాన్ చేసుకున్న ఇల్లు, కారు, సకల సౌకర్యాలు, పిల్లలు....... ఔను, దేవుడు మేలే చేశాడు. పిల్లలు లేక పోవడం ఒకరకంగా మంచిదే అయ్యిందేమో ! లేకపోతే...... ఏమో, వాళ్ళే ఉంటే ఈ బంధమిలా బలహీనంగా మారేదా......? దీనికంతటికీ కారణమైన ఆమె ఫ్రెండెవడో, ఆ శత్రువుని కనిపెట్టి, తగినశాస్తి చేయాలన్న కసి నాలో జడలు విరబోసుకుంటూంది - అప్పుడప్పుడూ. సరిగ్గా వాణ్ణి కనిపెట్టాలనుకునే సమయంలోనే చాలా తెలివిగా రాధ వాడ్ని కనబడనీయకుండా జాగ్రత్త పడుతోంది. పోనీ, ఓ ప్రైవేట్ డిటెక్టివ్‌ని సంప్రదిస్తే.......

టేబుల్ మీద ఇంటర్ కం మోగింది.

'ఇదొహటి - స్టెనో. టైం దొరికినప్పుడల్లా సుత్తి మొదలెడుతుంది. ఏదో చాలా క్లోజ్ అయిపోయినట్టు. చూస్తుంటే ఈ అవకాశాన్ని అడ్వెంటేజ్‌గా చేసుకొని నామీద పట్టుసాధించాలనుకుంటోందే. అసలు ఆడదంటేనే అసహ్యం, కసి పెరుగుతున్నాయి నాలో. ఇప్పుడు మాట్లాడనీ ! మొహమ్మీదే చెడా-మడా చెరిగేస్తాను........' రిసీవరెత్తాను.

"సర్ ! గిరీశం వాంట్స్ టు మీట్ యు ! హియిజ్ వెయిటింగ్ హియర్ షల్ ఐ......."

"సెండ్‌హిమ్ యిన్" ఠక్కున చెప్పేశాను.

"హాయ్ ఆకాశ్ !" స్వింగ్‌డోర్‌తో పాటు ఉత్సాహాన్ని తోసుకుంటూ లోపలికొచ్చాడు గిరీశం.

"హలో !" మామూలుగా అంటూ షేక్‌హ్యాండిచ్చి, చెయిర్ చూయించాను.

"ఏమిటలా ఉన్నావ్ ?" నవ్వుతూ కూర్చుంటున్నాడు వాడు.

అంటే, వీడికీ తెలిసిపోయిందన్నమాట ఈ సంగతి. ఇదే విచిత్రం ఈ లోకంలో. మన వ్యక్తిగత విషయాలు మనకంటె ఎక్కువగా, వేగంగా అందరికీ తెలిసిపోతాయి. పరాయివాళ్ళ పర్సనల్ విషయాల్లో చూయించే ఈ ఆసక్తి తమ విషయాల్లో కనబరిస్తే సమాజమింత అనారోగ్యంలో కొట్టుకునేది కాదేమో! వీడి రాకకి నేపథ్యం కూడా మన బాధే కాబోలు. అయినా వీని జుట్టు మన చేతిలోవుంది, మనమా అవకాశమిస్తేగదా !

"ఎనీథింగ్ రాంగ్ ?" నేను సమాధానం ఇవ్వకపోవడానికి వాడు మరోకోణం వెతుక్కున్నట్టున్నాడు.

"నో ! నథింగ్ !" తేరుకుంటూ మామూలుగా అనే ప్రయత్నం నాది.

"నేన్రావడం ఇష్టం లేదా ?" వాడంత డైరక్టుగా అడుగుతాడనుకోలేదు.

కాని, వాడ్ని దారి మళ్ళించి, రెడ్‌హేండెడ్‌గా పట్టుకునేందుకు వాడే వీలు కల్పించాడు.

"తన వాళ్ళొస్తే మొహం చాటేయడం, ఇష్టం లేదంటూ మొహమ్మీదే చెప్పడం అందరికీ చేతకాదు లేరా !" సూటిగా వదిలాను.

వాడి మొహంలో రంగులు మారడం స్పష్టంగా కనిపిస్తోంది. 'అనుకున్నది ఒక్కటి-అయింది ఒక్కటి' లాంటి వాని పరిస్థితి సంతోషాన్ని కల్గజేసింది. (ఎదుటివాడి బాధే మనకానందం కదా!)

"ఎందుకలా అన్నావ్ ?" మాటల్ని కూడగట్టుకున్నాడు.

ఏమీ తెలియనట్టు వాడలా అడగటం (నటించడం) నాకాశ్చర్యాన్ని కలిగించింది.

"నీ గురించే !" ముసుగులో గుద్దులాట నాకిష్టం లేదు. ఈ అవలక్షణంతోనే బతుకు దుర్భరమౌతోంది - నానాటికీ.

"నేనేం చేశాను ?" ఆలోచిస్తూ అన్నాడువాడు.

"నటించకు ! అన్నయ్యనెంత 'బాగా' ఆదరించింది నాకు తెలీదనుకోకు."

నేనంత సూటిగా అడుగుతాననుకోలేనట్టుంది వాడు. కొద్దిసేపు మాటలు మరచినట్టు కూర్చుండిపోయాడు.

"నువ్వు నమ్మగలిగితే రక్తసంబంధాన్ని మించింది లేదురా !" సినిమా డైలాగు వచ్చేసింది-ఠక్కున నా నాలికమీదికి. "పెళ్ళాం పోతే మళ్ళీ కట్టుకోవచ్చు! అన్నదమ్ముల్ని కోల్పోతే సాధించుకోగలమా ?" నాకు తెలియకుండానే ఆవేశం చోటు చేసుకుంది గొంతులో.

"సినిమాలు బాగా చూస్తున్నావా ?"

అది నేనెదురు చూడని ప్రశ్న. అయినా తేరుకున్నాను వెంటనే "ఏం ? సినిమాలు మాత్రం ఎక్కడినుంచొచ్చాయి ? మనల్ని బట్టి అవీనూ"

వాడు ముసిముసిగా నవ్వడం నాకు చిరాకు తెప్పించింది. అది పట్టించుకోలేదు వాడు.

"ఒరే, కథకు కాళ్ళు, ముంతకు చెవులూ లేనట్టే సినిమా వాళ్ళకి ఆదర్శాల్లేవురా ! ఉంటే, వాడి మనుగడే కష్టమవుతుంది." ఏదో పరిశోధించి కనిపెట్టినట్టు ఫోజు పెట్టాడు వాడు. నేనేదో అనేంతలో మళ్ళీ అన్నాడు.

"ఈ రోజు పెద్దవాళ్ళు ముఖ్యమన్న వాడే రేపు యువత పక్షం వహిస్తాడు. ఆదర్శం వేరు, ఆదర్శవాదం వేరు. వినేవాడు వెంగళప్పయితే ఎన్నయినా చెబుతారు. అన్నదమ్ముల అనుబంధాన్ని గొప్పగా పొగిడిన వీళ్ళే- భార్య గొప్పతనాన్ని గురించి కొన్ని వేల రీళ్ళు చూయించారు."

ఉలిక్కిపడ్డాన్నేను. 'ఏంటీ' వీడు మళ్ళీ నేను తప్పించుకుంటున్న టాపిక్‌కి వచ్చాడు ?' ఈ స్పృహకల్గగానే.... "అదిసరే. ఉపన్యాసాలాపి, అన్నయ్యనెందుకు అవమానించి పంపావో చెప్పు !"అన్నాను.

వాడు మెల్లగా చెప్పసాగాడు. "ఆకాశ్! నేనెవ్వరితోనూ ఈ విషయం చెప్పుకోలేదు. కాని, తప్పనిసరై నీతో చెబుతున్నాను. నువ్వైనా ఈ రహస్యాన్ని దాచుకుంటావనే నమ్మకంతోనే.

"అన్నయ్య పట్ల నాకెప్పుడూ గౌరవమే. ఆయన్ని ఏనాడూ నేను నిరాదరించ లేదు. కాని, ఆయనే మా సంసారంలో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నించాడు."

నాలో ఆసక్తి, ఆశ్చర్యం, అనుమానం.....

"ఒకరోజు నేనాఫీసుకు వెళ్ళిన సమయంలో ఇంటికెళ్ళాడట. సంగీతతో పాటు ఎవరో అపరిచితుడ్ని చూశాడట. చూసినవాడు వాళ్ళని నిలదీయలేదు. కనీసం సంగీతనైనా అడగలేదు. పోనీ, నాతోనూ చెప్పలేదు. సరాసరి మా మామయ్య (సంగీత వాళ్ళ తండ్రి) వాళ్ళింటికెళ్ళి 'మీ అమ్మాయిని మీరు మర్యాదగా మీ యింటికి తెచ్చుకోండి. లేకపోతే విడాకులివ్వాల్సొస్తుంది మావాడు. ఆమె మరొకరితో పడగ్గదిలో ఉండటం నేను కళ్ళారా చూశానని చెప్పాడట."

"తర్వాతేం జరిగింది ?" ఆశ్చర్యాన్నణచుకోలేక పోయాన్నేను.

"మామయ్య పాతకాలం మనిషి . పరువంటే ప్రాణమిచ్చేరకం. నేనులేనప్పుడు ఇంటికొచ్చి, సంగీతని చెడామడా తిట్టి, 'ప్రాణం తీసేస్తానని బెదిరించి పోయాడట."

"ఈ సంగతి నీకెప్పుడు తెలిసింది." నా క్యూరియాసిటీ.

"రెండు మూడు రోజులుగా సంగీత మూడాఫ్‌లో ఉండటం గమనించి అడిగాన్నేను. మొదట 'ఏమీలే'దంది. గుచ్చిగుచ్చి అడిగిన మీదట చెప్పింది జరిగిందంతా." నిట్టూర్చి టేబుల్ మీదున్న గ్లాసెడు నీళ్ళు పట్టించాడు.

"ఇంతకూ అతనెవరట ?" సాలోచనగా అడిగాను. అలా అడగకుంటే బావుండేదనిపించింది, తర్వాత.

"అదంత అవసరమా ?" ఉలిక్కిపడ్డాన్నేను. అది గమనించకుండా, అగకుండా

అతను చెప్పుకుపోతున్నాడు. "అనిపించింది. భార్యభర్తల మధ్య పరస్పర విశ్వాసంలో లోపం లేనప్పుడు అనుమానానికి తావేలేదు. నా మీద నాకు నమ్మకముంది. సంగీత మీద అంతకు మించిన విశ్వాసం. ఆమె ఎట్టిపరిస్థితిల్లోనూ దిగజారదని నాకు తెలుసు. ఒకవేళ మానవ బలహీనత కొద్ది ఏదైనా పొరబాటు జరిగినా క్షమించగల ఔదార్యం నాకున్నది. అంతేగాని, అనుమానాలకు ఊహల రెక్కలు తొడిగి, నిజమైన ఆనందాన్ని దూరం చేసుకునే దౌర్భాగ్యంలో లేను. నేను వద్దన్నా, తర్వాత తనే చెప్పింది ఆమె స్నేహితుడి గురించి. అతని సంస్కారం గురించి తెలిసింతర్వాత, నేను తొందరపడకపోవడం ఎంత మంచిదైందో తెలిసొచ్చింది.

భావరహితంగా గిరీశ్‌నే చూస్తున్నాను.

"ఇంత చేసినా, అన్నయ్యని 'ఎందుకిలా చేశా'వని అడగలేదు. కాని, ఈ సంగతి తెలిసిన తర్వాత అన్నయ్యని మునుపటిలా ఆదరించలేకపోయాను. సంగీతకి సహజంగానే అన్నయ్యపట్ల ఆదరం తగ్గిందో, అతనే గిల్టీగా ఫీలవుతున్నాడో నాకు తెలీదు. కాని, నేను లేనపుడు ఇంటికి రాడు. నేనున్నపుడూ సౌకర్యంగా ఫీలవడు. ఇదీ పరిస్థితి. ఇప్పుడు చెప్పు ! తప్పెవరిది ?"

వాని తపొప్పుల గరించి ఆలోచించే స్థితిలో లేను.

"గిరీశ్ ! నేనర్జంటుగా ఇంటికెళ్ళాలిరా. ప్లీజ్ ! ఏమనుకోకు !" వాని సమాధానం కోసం చూడకుండా బయలుదేరేందుకు సిద్ధమయ్యాను.

❄ ❄ ❄

బిజీ రోడ్డులో కారు దారి వెతుక్కుంటూ దూసుకుపోతుంటే ఆలోచనలు మెదడును కుదిపేస్తున్నాయి....

అనుమానం కలిగినపుడు దాన్ని నిర్మూలించేందుకు ప్రయత్నించాలికాని, ఓ మగాడినన్న ఈగో తో దాన్ని నేను పెంచి పోషిస్తున్నాను.

తను గతకొన్నాళ్ళుగా నీరసంగా, డల్‌గా ఉన్న విషయం గమనిస్తూ కూడా ఒక్కసారయినా పరామర్శించలేకపోయాను. కనీసం కారణమైనా తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

అద్దంలో ప్రతిబింబాల్లా ఒకరికొకరం ఎదురెదురుగానే ఉన్నా, గాజుగ్లాసు లోని నీడల్లానే మెలుగుతున్నాం. పిచ్చిది. నేనంటే ఎంత అభిమానం. అసలెలా భరిస్తుంది నన్ను ? ఈటెల్లాంటి నా మాటలిప్పుడు గుర్తుకొస్తుంటే....ఛ !

"నేను లేకుంటే నేం ? నీ కవసరమైన తోడెప్పుడూ నీకుంటుంది గదా!" అంటూ ఆమె గుండెను పిండినప్పుడు.

"మీ యింటికెవరైనా వచ్చారా ఆంటీ ?" అంటూ రాజేశ్వరమ్మని శ్లేషార్థంలో అడుగుతూ మృదువైన ఆ హృదయం మీద సూదుల్తో గుచ్చినప్పుడు....... అలా అవకాశం దొరికినప్పుడల్లా ఏదో ఒకటి అంటూనే..... ఎన్నని.........ఎన్నెన్నని గాయాలు చేశానో !

నిజానికి రాధ నాపట్ల చూపే ప్రేమను శంకించానుగాని, రాధపట్ల నా ప్రేమలోనే అసంపూర్ణత ఉందన్న విషయం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. నా హింస భరించలేకే 'ఏదైనా ఉద్యోగం చేస్తా'నంది గాబోలు. కాని, ఆ అవకాశాన్ని సైతం నా శాడిజాన్ని పదును పెట్టేందుకే వాడు కున్నాను - "ఇక్కడ నీ ప్రైవసీకెం లోటొచ్చిం"దంటూ ఆమె ఎదదని పరపరా కోసేశాను.

ఇంత చేసినా ఏనాడూ తను బయటపడలేదు. సముద్రంలా దాచుకుంది. ఆకాశంలా చూసుకుంది.

ఈ రోజునేను ఆఫీసుకి బయలుదేరే ముందు మరీ నీర్సంగా కనిపించింది. ఎలా ఉందో......... ఆదరా బాదరగా ఇల్లు చేరుకుని కారు పార్క్ చేస్తూనే గుమ్మంలోకి దూకాను.

వెక్కిరిస్తూ తాళం కప్ప !!

"..................? ? ?

ఏదో ఆలోచిస్తూ మళ్ళీ కారు దగ్గరికొస్తున్న నన్ను పిలిచారు రాజేశ్వరమ్మ-బాల్కనీలోంచి.

"ఇదిగో నాయనా ! ఆవిడగారెక్కడికో వెళ్ళారు. వస్తే తాళాలీయమన్నారు." ప్రతి అక్షరానికీ వ్యంగ్యం దట్టించింది. తెలుగు టీ.వి. తార మేకప్‌లా.

"అవన్నీ పట్టించుకునే స్థితిలో లేను నేను. తాళం చేతుల్ని ఓసారి గాలిలోకి విసిరి మళ్ళీ పట్టుకున్నాను. ఒక్క నిముషం మెదడంతా బ్లాంక్‌గా మారిన అనుభూతి.

'ఎక్కడికెళ్ళి ఉంటుంది ?'

'తను వచ్చేదాక వెయిట్ చేయాలి - కూల్‌గా ; వచ్చాక అడగాలి వివరంగా. ఎస్ ! అదే బెటర్?' అనుకుంటూ డోర్ తెరిచాను.

ఇంట్లోకి రాగానే టీ.వీ. అన్ చేయడం నాకలవాటు. రాధకి పుస్తకాలు స్నేహితులైతే, టీ.వీ. నా బెస్ట్‌ఫ్రెండ్. టి.వి. ఆన్‌లో ఉందంటే నేనున్నట్టే ఇంట్లో. నేను నిద్రపోతేనే దానికి రెస్ట్. అందుకే బెడ్‌రూంలో కూడ బుల్లి టీవీ ఏర్పాటు.

రిమోట్ చేతిలోకి తీసుకోబోతుంటే దానికిందున్న తెల్లకాగితం నా దృష్టిలో పడింది. అందులోని అందమైన రాత రాధదే. గబుక్కున చేతిలోకి తీసుకున్నాను. అక్షరాల వెంట పరుగెత్తాయి కళ్ళు .......

'డియర్ ఆకాశ్ !

నన్ను వదిలించుకునేందుకు నువ్వంతగా కష్టపడనవసరం లేదు. నీకిష్టం లేకపోతే నిన్నిబ్బందిపెట్టను. ఏనాడూ నీ పట్ల నాకు వ్యతిరేకత లేదు. ఇప్పటిలాగే. కాని, గతకొన్నాళ్ళుగా నీ ప్రవర్తన నన్ను బాధపెడుతోంది. మనసులోని మాట చెప్పలేక, సూటిపోటి మాటల్తో నన్ను.....

'నేనీ బాధ భరించే స్థితిలోలేను. మొదట్లో నీ అనుమానం అర్థమై నిజం చెప్పేయాలనుకున్నాను. కాని, నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీశావు. అనుమానాన్ని నిజంగా ఊహించుకున్నావు. నా మానసిక స్థితి నా చేజారిపోతున్న అనుభూతి........అందుకే కొన్నాళ్ళపాటు అమ్మ దగ్గరికి వెళ్ళాలనుకుంటున్నాను. అమ్మ ఒడి తప్ప నన్ను అక్కున జేర్చుకునే.....

నీకు రావాలనిపిస్తేనే, రావాలనుకున్నప్పుడే రా ! నీమీద నాకే కాంప్లెయింటూ లేదు. రాకూడదనుకుంటే.......

'నీకు చెప్పకుండా వెళ్తున్నందుకు క్షమించు.'

సవాలక్ష ప్రశ్నలకు ఒక్క సమాధానం లాంటి ఆ ఉత్తరం చూశాక కన్నీళ్ళేకాదు, మనసూ ఆగలేదు.

రాధ ట్రెయిన్‌లో విజయవాడ చేరుకోక ముందే నన్నక్కడికి చేర్చేందుకు 'మారుతి' పరుగు ప్రారంభించింది.

నా మనశ్శక్తి గెలిచింది. ఐదు నిముషాలు ముందుగానే స్టేషన్‌కి చేరుకున్నాను. ట్రెయిన్ వచ్చేదాక వెయిట్ చేయడం గగనమైపోయింది.

వేలమందిలో ఉన్నా, నా రాధని నేను గుర్తించగలను. అల్లంతదూరంలో...

లేత గులాబీ ఒంటికి నీలాకాశం రంగు చీరెలో భారంగా కదుల్తూ ఎప్పుడూ వెన్నెల్లా వెలిగే చిరునవ్వుని కారుమబ్బులాంటి దిగులు అడ్డుకుంటూంది. ఆ నవ్వుల్ని అడ్డుకున్న రాహువుని నేనేనన్న నిజం నా గుండెల్ని మెలిపెట్టింది.

ఎగ్జిట్ డోర్‌లో టి.సి. చేతికి టికెటిచ్చి. తలవంచుకొని నాలుగడుగులు వేసిన తనకి అడ్డుగా......... నిలబడ్డాను.

చివుక్కున తలెత్తింది.

క్షణంలో కోపం ఆశ్చర్యమైంది.

మరుక్షణం కళ్ళనిండా నీళ్లు.

నన్ను నేను సంభాలించుకోవడం కష్టమైంది. గబగబా తన చేయి పట్టుకొని లాక్కెళుతున్నటు తీసుకెళ్ళాను కారు దగ్గరికి. కలలో లా అనుసరించింది.

కారు డోరులాక్ చేయగానే మెడవంపుకింద మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

"ఏయ్ ! ఏమిటిది ! మృదువుగా భుజాన్ని కుదిపి, కళ్ళు తుడిచాను.

ఇగ్నిషన్ కీ తిప్పుతుంటే మెల్లగా గొణిగింది – నాకు ప్రమోషన్ రాబోతున్న సంగతి – తండ్రిగా.

సిగ్గు విడిచి, అక్కడే ముద్దు పెట్టుకున్నాను గట్టిగా ఒడ్డు ఛేదించుకున్న కన్నీళ్ళాగలేదు. కన్నీళ్ళు కూడా రుచిగా ఉంటాయని తొలిసారిగా గ్రహించాను.

కారు మామయ్య వాళ్ళింటికేసి హాయిగా పరుగెడుతుంది.

నా భుజం మీద తలనాన్చుకున్న రాధ మెల్లగా గొంతువిప్పింది.

"అతను ......"

"రాధా ! ప్లీజ్ !" ఆమె ఎవరి గురించి చెప్పబోతోందో నాకు తెలుసు. "నా రాధననుమానిస్తే నన్ను నేననుమానించుకున్నట్లే. నాకు తెలుసు. నారాధ ఏ పొరబాటూ చేయదు." అన్నాను దృఢంగా

నాలోని అసలైన శత్రువు (అనుమానం) గుండెల్లో నుండి పారిపోతుంటే, తేలికైన మనసుతో హాయిగా పరుగెత్తింది కారు.

కారాగాక రాధ కళ్ళలోకి చూశాను.

తొలిరేయినాటి వెలుగులు ఆ కళ్ళలో రెట్టింపై ప్రతిఫలిస్తుంటే, నన్ను నేను నిగ్రహించుకోవడం కష్టంగాఉంది.